

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబసభ్యులకు అందజేస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్

హయత్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీగౌడ్ అన్నారు. గురువారం హయత్‌నగర్‌లోని తన కార్యాలయంలో మన్సూరాబాద్ డివిజన్‌కు చెందిన చెన్నూరి ప్రియంకకు మంజూరైన రూ. 60 వేల చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్న ఎంతో మంది ఈ పథకం ద్వారా ఆర్థిక ఉపశమనం పొందుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద ప్రజలకు వైద్య భారాన్ని తగ్గిస్తోందన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఎల్లమ్మ బోనాలకు రండి

వనస్థలిపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎల్లమ్మ తల్లి దేవాలయ బోనాలకు రావాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌ను ఆలయ కమిటీ చైర్మన్ ముద్దగౌని చంద్రకాంత్ గౌడ్.. పత్రిక అందజేసి ఆహ్వానించారు. ఈనెల 27న సాహెబ్‌నగర్ (బతుకమ్మకుంట)లోని దేవాలయంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయంలో భాగమైన బోనాల ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని యాష్కీగౌడ్ అన్నారు. బోనాల పండుగను వైభవంగా నిర్వహించుకునేందుకు సీఎం.. దేవాలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చౌదరి దివాకర్ లింగం పాల్గొన్నారు.

సమాచారం ఎందుకివ్వరు?

● ఆ అధికారులపై చర్యలు తీసుకోండి

● జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ శ్వేతారెడ్డి వినతి

సైదాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో అభివృద్ధి పనుల వివరాలు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నా సంతోష్‌నగర్ సర్కిల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్నకు ఆమె ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధికి తమ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు అధికారులు గడువు ముగిసినా ఇవ్వకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. వివరాలు గోప్యంగా ఉంచడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. ఆర్టీఐ అమలు చేయని సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



జెడ్సీకి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి



నల్ల, ఎర్ర పోచమ్మ ఆలయ ప్రాంగణంలో పేదలకు అన్నదానం చేస్తున్న అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ దండేటికార్ భగవత్‌జీ

పేదలకు అన్నదానం

చంపాపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): మాత అన్నపూర్ణేశ్వరీ అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ దండేటికార్ భగవత్‌జీ ఆధ్వర్యంలో 500 మంది పేదలకు అన్నదానం చేశారు. చంపాపేటలోని నల్లపోచమ్మ ఆలయం ఆవరణలో గురువారం అమావాస్యను పురష్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. 27మాసాలుగా పేదలకు ప్రతీ అమావాస్య రోజు అన్నప్రసాదంను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రవి ముదిరాజ్, సుశీల్‌కుమార్, సంతోష్ లడ్డా, గణసాల వెంకటేష్, ఆడేళ్ల రాజా, అండేరార్ వెంకటేష్, టింగ్లీకర్ రాజేష్, తిలక్‌రాజ్, విఠల్, షానవాజ్ హుస్సేని, మురళీధర్, మనోహర్ పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

మన్సూరాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సహారా రోడ్డులోని పోచమ్మ దేవాలయంలో బోనాల పండుగ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి సమక్షంలో ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ.71,716ల ఆదాయం వచ్చిందని విఠల్‌రెడ్డి తెలిపారు. పట్టువస్త్రాలు, ఇతరత్రాలను త్వరలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్లు పోచబోయిన గణేష్‌యాదవ్, నాంపల్లి శంకరయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఈశ్వర్, కోశాధికారి పాతూరి రాజేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం, జూలై 24(ఆంధ్ర జ్యోతి): కురుస్తున్న వర్షాలపట్ల కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. కమలానగర్‌లోని వరదనీటి కాలువ, మ్యాన్ హోల్స్‌ను గురువారం కాలనీవాసులతో కలిసి ఆయన పరిశీలించారు. కురుస్తున్న వర్షాలకు కాలనీవాసులు అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలన్నారు. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలనీవాసులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

బోనాల ఏర్పాట్ల పరిశీలన

హయత్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లో ఆదివారం జరగనున్న బోనాల పండగ ఏర్పాట్లను గురువారం కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పరిశీలించారు. డివిజన్‌లోని మండల పరిషత్ కార్యాలయం, శుభోదయనగర్, అన్మగల్ హయత్‌నగర్‌తో పాటు పలు ఆలయాలకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు.

తిమ్మాయిగూడ రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుత్బుల్లాపూర్.. తిమ్మాయిగూడ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం కమిషనర్ రవీందర్‌రెడ్డికి బీజేపీ సీనియర్ నాయకుడు పిల్లి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నేతలు వినతి పత్రం అందజేశారు. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తిమ్మాయిగూడ రోడ్డు గుంతల మయంగా మారిందని, అక్కడక్కడ ఏర్పడిన గుంతల్లో మోకాళ్ల లోతులో వర్షం నీరు నిలిచిందన్నారు. ఆగస్టు 3న గ్రామంలో బోనాల పండగ జరగనుందని, ఆలోగా రోడ్డుకు మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాల ఎదుట ఇలా

నడిచేది ఎలా?

● మురుగు నీటిలో నుంచే బడి లోపలికి విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధాన గేటు ఎదుట మురుగు నీరు నిల్వ ఉండి చెరువును తలపిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల సమీపంలోని డ్రైనేజీ మ్యాన్ హోల్ పొంగిపొర్లుతోంది. ఈ నీరంతా స్కూల్ ప్రధాన గేటు వద్దకు చేరుతోంది. ఇప్పుడి ఈ ప్రాంతమంతా మురుగు వాసనతో కంపుకొడుతోంది. ఇందులోనే విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. వార్డు ప్రజలు సైతం నడుస్తున్నారు. పాత డ్రైనేజీ లైన్ కావడంతో చిన్న పాటి వర్షానికే మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతోందని మాజీ కౌన్సిలర్ చెవుల హరిశంకర్ తెలిపారు. పైప్‌లైన్ మార్చాలని పలుమార్లు మున్సిపల్ అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



కుంట్లూర్ ప్రభుత్వ పాఠశాల గేటు వద్ద నిలిచిన డ్రైనేజీ మురుగులోనే నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థి

వెలగని వీధిదీపాలు.. అలుముకున్న అంధకారం

● రాత్రి అయితే విషపురుగుల సంచారం
● ఇళ్లల్లోకి వస్తున్నాయి
● ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లు
● పాములకు ఆవాసాలు
● ఇతర సమస్యలూ పరిష్కరించాలి
● కమిషనర్‌కు బడంగ్‌పేట్ శ్రీమారుతీనగర్ వాసుల వినతి



కమిషనర్ సరస్వతికి వినతి పత్రం అందజేస్తున్న శ్రీమారుతీనగర్ వాసులు

సరూర్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): కాలనీలో విద్యుత్ దీపాలు సరిగా వెలగడం లేదని, దీంతో రాత్రి అంధకారం నెలకొంటున్నదని, అందులోనూ పాములు వంటి విషపురుగులు సంచరిస్తున్నాయని బడంగ్‌పేట్ కార్పొరేషన్ 28వ డివిజన్ శ్రీమారుతీనగర్ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ సైతం సరిగా లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోందని, ఆపై దుర్గంధం వెదజల్లుతున్నదని వాపోయారు. ఆయా సమస్యలతో పాటు కాలనీలో నెలకొన్న ఇతర సమస్యలను పరిష్కరించాలని గురువారం మునిసిపల్ కమిషనర్ సరస్వతిని కలిసి కాలనీ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఇక్కడి రోడ్ నంబర్లు 1, 2లలో డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా ఉందని కాలనీ అధ్యక్షుడు వేణు అన్నారు. కాలనీలోని ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగి పాములకు ఆవాసంగా మారాయన్నారు. రాత్రి వేళలో ఇళ్లల్లోకి వస్తున్నాయన్నారు. పలు రోడ్లు అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. కాలనీలో కుక్కల బెడద సైతం ఉన్నదని కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శులు త్రివేణి, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, సాయికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్లు కృష్ణమోహన్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రమేశ్, సంయుక్త కార్యదర్శి ప్రదీప్‌కుమార్, కార్యదర్శులు సాయిజ్యోతి, చంద్రశేఖర్, లష్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

● 27న బోనాలు, 28న ఘటాల ఊరేగింపు

చంపాపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని పోచమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం, బోనాల పండుగ వేడుకలను ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్, కమిటీ సభ్యులు తెలిపారు. 25న ఉదయం గురువందనం, శాంతి మంత్ర పఠనం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, సాయంత్రం గణపతిహోమం, 26న ఉదయం 108 కలశాలతో మూల విరాట్ మహాభిషేకం, మధ్యాహ్నం 2 గంటలకు కల్యాణం, 27న బోనాల సమర్పణ, 28న సాయంత్రం ఘటాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. బ్రహ్మశ్రీ భాస్కరభట్ల రాహుల్‌శర్మ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర కాలనీలు, బస్తీల ప్రజలు అధిక సంఖ్యలో వార్షికోత్సవంతో పాటు బోనాల వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



కొలువుదీరిన అమ్మవారు



పోచమ్మతల్లి దేవాలయం

వైభవంగా బోనాల పండుగ

సరూర్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అల్మాస్‌గూడలో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది లాల్‌దర్వాజ(సిటీ) బోనాల తర్వాత వచ్చే గురువారం బోనాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ యేడు కూడా ఇదే రోజైన గురవారం స్థానికులు, ప్రజలు పోచమ్మ, మైసమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆయా ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. మాజీ కార్పొరేటర్లు రామిడి కవితా రాంరెడ్డి, రామిడి మాధురీవీరకర్ణారెడ్డి, సంరెడ్డి స్వప్నావెంకట్‌రెడ్డి, బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, ముత్యాల లలితాకృష్ణ తదితరులు కుటుంబ సభ్యులు.. అమ్మవార్లకు బోనం సమర్పించి పూజలు నిర్వహించారు.



అమ్మవారికి బోనం తీసుకెళ్తున్న మాజీ కార్పొరేటర్ కవితారాంరెడ్డి కుటుంబసభ్యులు

అర్హులకు రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

● ఎమ్మెల్యే రంగారెడ్డి

హయత్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు అందాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం తుర్కయంజాల్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై నియోజకవర్గం స్థాయి అధికారులతో కలిసి ఆయన చర్చించారు. రేపటి నుంచి పది రోజుల పాటు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. గ్యాస్ సబ్సిడీ రావడం లేదని చాలా మంది ఫిర్యాదు చేస్తున్నారన్నారు. వారి సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. 200 యూనిట్ల లోపల కరెంట్ బిల్లులు వస్తున్న వారిందరికీ గృహజ్యోతి పథకం వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఆర్‌డీవో అనంతరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ఎలక్ట్రిసిటీ డీఈఈ పాండు రంగారెడ్డి, డీపీఓ సురేష్‌మోహన్, డీఎల్‌పీవో సాధన, అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీడీవో శ్రీవాణి, మున్సిపాలిటీల కమిషనర్‌లు అమరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాలకృష్ణ, సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డితో పాటు ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాలకు చెందిన వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి

‘చేపపిల్లల పంపిణీ ఇంకెప్పుడు?’

హయత్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ విషయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన చేయక పోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారని మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నరసింహ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల మత్స్యకారుల 3వ మహాసభ గురువారం కొహెడాలో జరిగింది. కొహెడాలో నిర్మించనున్న చేపల మార్కెట్ పనులు ప్రారంభించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నిందితుడిని విలేకరుల ఎదుట ప్రవేశపెడుతున్న ఏసీపీ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్

వ్యసనాలకు బానిసై.. బైక్ చోరీల బాట

● యువకుడి అరెస్ట్, రెండు వాహనాలు స్వాధీనం

చంపాపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): బైకులు చోరీ చేస్తున్న యువకుడిని కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్‌తో కలిసి చంద్రాయణగుట్ట ఏసీపీ ఏ.సుధాకర్ వివరాలను వెల్లడించారు. మూసారాంబాగ్‌లో ఉంటున్న మహమ్మద్ ఆరీఫ్ ఈనెల 8న డీఎంఆర్‌ఎల్ చౌరస్తాలో ఉన్న పోచమ్మ ఆలయం పక్కన బైక్ పార్క్ చేసి పని నిమిత్తం వెళ్లాడు. మరుసటి రోజు పార్క్ చేసిన ప్రాంతానికి రాగా వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో కంచన్ బాగ్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 10న ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బీడీఎల్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఖాజాపహాడీకి చెందిన ఫిరోజ్‌ఖాన్ (22)ను అదుపులోకి తీసుకున్నారు. విచరించగా చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని నుంచి రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తాగుడు, గంజాయిలకు బానిసై డబ్బులు కోసం బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నట్లు ఏసీపీ తెలిపారు. కంచన్ బాగ్ పోలీస్‌స్టేషన్‌లో 2, సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ లో ఒక్కొక్కటి చొప్పున బైక్ చోరీ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసును ఛేదించిన ఎస్ఐ రాజు, సిబ్బందిని ఏసీపీ, సీఐ అభినందించారు.

బాధితులకు 35 మొబైల్స్ అప్పగింత

చంపాపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో చోరీకి గురైన 35సెల్‌ఫోన్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కంచన్ బాగ్ పోలీస్‌స్టేషన్ లో గురువారం ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్‌తో కలిసి చంద్రాయణగుట్ట ఏసీపీ ఏ.సుధాకర్ వివరాలను వెల్లడించారు. దొంగతనంతో పాటు ఇతర కారణలతో 1జనవరి2024 నుంచి 01జూన్ 2025వరకు సెల్‌ఫోన్స్ పోగొట్టుకొని సీఈఐఆర్ పోర్టల్‌లో 78 మంది ఫిర్యాదు చేశారు. ఈఎంఈఐ నంబర్ల ఆధారంగా పోలీసులు 35 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారిని స్టేషన్ కు పిలిపించి వారికి అందజేసినట్లు కమల్‌కుమార్ తెలిపారు.

మున్సిపాలిటీలో పార్కు స్థలాల వివరాలు సేకరణ

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో పార్కుల అభివృద్ధిలో భాగంగా గురువారం హెచ్ఎండీఏ, విజిలెన్స్ అధికారులు మున్సిపాలిటీని సందర్శించారు. ఎన్ని ఖాళీ పార్కు స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలను టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో మొత్తం 94 పార్కు స్థలాలున్నాయని, వాటికి సంబంధించిన జాబితాను హెచ్ఎండీఏ అధికారులకు అందజేసినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.



నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు భరత్ రెడ్డి

పెన్షనర్ల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి

చాదర్‌ఘాట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మూసారాంబాగ్ లక్ష్మీనగర్ కాలనీ నివాసి పున్ రెడ్డి కృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మలక్‌పేట సలీంనగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.సుధాకర్, ఉపాధ్యక్షులుగా కె.మోహన్, ఎస్.కృష్ణ, లలిత సరోజమ్మ, సుభాష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఇ.రమాదేవి, సంయుక్త కార్యదర్శులుగా యాదగిరి, సరోజిని, వెంకటేశ్వర్‌రావు, పవన్ కుమార్, కోశాధికారిగా రాపెల్లి కృష్ణహరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గసభ్యులుగా రామాచారి, చంద్రశేఖర్, దయానంద్, సుదర్శన్, నర్సింహులు ఎన్నికైన వారిలో ఉన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మారం భరత్ రెడ్డి అధ్యక్షతన కార్యవర్గం ఎన్నికైంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్లు తప్పనిసరిగా సంఘం సభ్యులుగా నమోదు చేసుకోవాలని జిల్లా నూతన అధ్యక్షుడు కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు.



కాలనీవాసుల సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

పరిసరాల శుభ్రత బాధ్యత అందరిదీ

వనస్థలిపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రశాంత్ నగర్ కాలనీలో గురువారం కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని మహిళ మండలి పక్కనున్న చెత్త డంపింగ్ యార్డ్ మూలంగా దుర్గంధం వెదజల్లడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దాన్ని తక్షణమే తొలగించాలన్నారు. ఆ మేరకు తొలగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.